క్లుప్తంగా

మల్టీపర్పస్ విధానంతో నష్టం



ఎంపీడీఓకు సమ్మెనోటీసు ఇస్తున్న నేతలు

యాలాల: పంచాయతీ కార్మికుల పాలిట శాపంలా మారిన మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసి జీఓ 51ని సవరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బుగ్గప్పలు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్య పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును ఎంపీడీఓ పుష్పలీలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానం పేరిట కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. పనికి తగిన వేతనానికి పూర్తి విరుద్ధంగా ఉన్న మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు అందడం లేదన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఆరిఫ్, షబ్బీర్, ఆనందం, హన్మంతు, శ్యామప్ప, సరస్వతి తదితరులు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి



మాట్లాడుతున్న ధనలక్ష్మి

బంట్వారం: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్ 3లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలన్నారు. ముఖ్యంగా ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. పుట్టిన బిడ్డకు రెండేళ్ల వరకు తల్లిపాలు తాగిస్తే ఎంతో శ్రేయస్కరమన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఏటీఓగా వెంకటరమణ



తాండూరు రూరల్: తాండూరు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో అసిస్టెంట్ సబ్‌ట్రెజరీ(ఏటీఓ)గా మంగళవారం ఆర్.వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన అజ్మత్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న ఏటీఓ వెంకటరమణ ఇక్కడికి ఇక్కడి వచ్చారు.

ఎస్‌టీఓగా తాజొద్దీన్

గతంలో పని చేసిన ఎస్‌టీఓ శ్రీధర్‌రెడ్డి బదిలీపై అయ్యారు. ఆయన స్థానంలో సికింద్రాబాద్ కార్యాలయంలో పని చేస్తున్న తాజొద్దీన్ తాండూరు ఎస్‌టీఓగా వచ్చారు.

పన్నెండేళ్ల పనితీరు భేష్



కార్యదర్శులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: మండలంలోని నాందార్‌పూర్‌కు చెందిన గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఇటీవల బదిలీ అయ్యారు. మంగళవారం గ్రామంలోని కురుమసంఘం కమ్యూనిటీ భవనం వద్ద గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. గ్రామానికి పన్నెండేళ్ల చేసిన సేవలు హర్షించదగినవని కొనియాడారు. ఆయన స్థానంలో వచ్చిన బాబుకు స్వాగతం పలికారు. ఇందులో మాజీ సర్పంచు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, మాజీ వార్డు సభ్యులు కిష్టయ్య, మల్లేశ్‌గౌడ్, అమర్‌నాథ్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణ

కొడంగల్ రూరల్ : కొడంగల్ నూతన ఎస్ఐగా జీవి.సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పూడూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని.. ఎక్కడున్నా మంచి పేరు తెచ్చుకోవాలని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపల్లికలాన్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఖాజామోహినోద్దీన్, శీలక్ష్మి, శ్వేత, శ్రీనివాస్‌లను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు సన్మానించారు.

పల్లెల్లో పంచాయతీ సందడి

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు గ్రూపులుగా ఏర్పడి నేతల మద్దతు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో పెల్లెల్లో ఎన్నికల సందడి షురువైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- గ్రూపులుగా ఏర్పడుతున్న నేతలు
- పార్టీ నేతల మద్దతు కోసం తీవ్ర పోటీ
- అభ్యర్థుల ఎంపికపై పెద్దల వద్ద లాబీయింగ్



దుద్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దుద్యాల్ : గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం జోరందుకుంది. దుద్యాల మండల కేంద్రంతో పాటు హస్నాబాద్, కుదురుమల్ల, హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, సంగాయపల్లి, చిలుముల మైల్వార్, హంసంపల్లి వంటి పెద్ద గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ రెండు, మూడు వర్గాలుగా విడిపోయి నాయకుల మద్దతు కోసం లాబీయింగ్‌లు మొదలుపెట్టారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడిన వారు, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ పెద్దల హామీలతో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారు ఇలా రెండు వర్గాలకు చెందిన వారు మద్దతు కోసం పార్టీ పెద్దల వద్ద ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆయా గ్రామాల్లో నిత్యం ఏదో ఒక కాలనీలో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ, మనకే మద్దతు ఉంటుందని ఎవరికి వారు చెప్పుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అధికంగా గిరిజన తండాలు ఉండడంతో తండాల్లో పెద్దగా వర్గాలు కనిపించడం లేదు.

పక్కాగా గెలుస్తామనే నమ్మకంతోనే..

దుద్యాల మండలం సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలోని మండలం కావడంతో పక్కగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారనే నమ్మకంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి చాలా మంది అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ప్రతి గ్రామం నుంచి రెండు, మూడు వర్గాలు పార్టీ పెద్దల వద్దకు నిత్యం



హస్నాబాద్‌లోని ఓ కాలనీలో కార్యకర్తల సమావేశం (ఫైల్)

క్యూ కడుతున్నారు. దీంతో ఎవరికి ఏం సమాధానం చెప్పాలో తలనొప్పిగా మారిందనే వాదన గట్టిగా వినిపిస్తుంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది మరింత వాడివేడిగా ఉండే అవకాశాలు లేకపోలేదు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



దుస్తులు పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న ప్రకాశ్

నవాబుపేట: ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేయూత ఇచ్చి, ప్రోత్సహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి పేర్కొన్నారు. కళాశాలలో పనిచేసే అధ్యాపకురాలు మంజుల వారి తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో పేదల పిల్లలు మాత్రమే చదువుతున్నారని అన్నారు. దుస్తులు పంపిణీ చేసిన అధ్యాపకురాలిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరేష్, రమేష్, శ్రీనాథ్, వెంకటయ్య, రవీందర్, కరుణాకర్, సందీప్, కీర్తి, సురేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత

బొంరాస్‌పేట: పాఠశాలల విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. మంగళవారం మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, భవిత కేంద్రంలో ఉన్న ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సేవా సంస్థ నుంచి స్కూల్ బ్యాగులు, చెప్పులు, మ్యాట్లు ఉచితంగా అందజేశారు. సంస్థ సహకారంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్, శ్రీశైలం, న్యాయవాది సంతోష్, జీహెచ్‌ఎం హరిలాల్, ప్రత్యేక ఉపాధ్యాయుడు వేణుగోపాల్, సీఆర్‌పీ సోమ్లా, శ్రీను, కిష్టప్ప, నరేందర్ తదితరులున్నారు.

స్వచ్ఛత ర్యాలీ

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛత ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం చేట్టిన 5 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అన్ని వార్డుల్లో శానిటేషన్ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, వార్డు కౌన్సిలర్ శ్రీదేవి సదానందరెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ తదితరులు

జాతికోసం పనిచేసే పార్టీ బీజేపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

యాలాల: దేశ నిర్మాణం, జాతికోసం అహర్నిశలు పనిచేసే పార్టీ బీజేపీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం యాలాల మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గంలో కందిబోర్డు ఏర్పాటు, శివసాగర్ ప్రాజెక్టు, జుంటుపల్లి ప్రాజెక్టుల అభివృద్ధి తదితర సమస్యలను పార్టీ కార్యవర్గం గుర్తించి, పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఇక్కడి నాయకుల అసమర్థత కారణంగా రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో దూసుకువెళ్తుంటే తెలంగాణలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు. రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్ శివ కుమార్, నాయకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

ఆలయ నిర్మాణానికి విరాళం

మర్పల్లి: మండలంలోని పట్లూర్ గ్రామంలో నిర్మిస్తున్న గ్రామదేవతల ఆలయ నిర్మాణానికి మెద్పల్‌కు చెందిన బోర్‌వెల్ కంపెనీ నిర్వాహకులు పెద్దోళ్ల శ్రీశైలం దంపతులు మంగళవారం రూ. 51 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంపదనలో కొంతమొత్తం దైవ కార్యక్రమాలకు విరాళం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. విరాళం అందజేసిన శ్రీశైలం దంపతులను గ్రామస్తులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

బంట్వారం: మండలంలోని బొప్పునారం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉ.6 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నూతన కార్యవర్గం

మర్పల్లి: మర్పల్లి వ్యవసాయ గ్రీన్ మార్కెట్ కమిటీ కమిషన్ ఏజెంట్ల నూతన కార్యవర్గ కమిషన్ ఏజెంట్లు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పటోళ్ల మల్లేశం పటేల్ (కల్‌ఖోడ), ఉపాధ్యక్షుడిగా సూనంపల్లి కార్తీక్ (బూచన్‌పల్లి), ప్రధాన కార్యదర్శిగా బిచ్చయ్య (కోట్‌మర్పల్లి), కోశాధికారిగా ముక్క శ్రీనివాస్ (కోహీర్), సభ్యులుగా మరో ఐదు మందిని ఎన్నుకున్నట్లు చైర్మన్ పటోళ్ల మల్లేశం తెలిపారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



ఏకరూప దుస్తులను అందజేస్తున్న అధికారులు

కుల్కచర్ల: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య అన్నారు. మంగళవారం తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణలతో కలిసి మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎస్టీ హాస్టల్, ప్రభుత్వ ఆస్పత్రి, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పరిశుభ్రతను పాటించడంతో పాటుగా కుటుంబ సభ్యులకు సూచనలు చేయాలని పేర్కొన్నారు. చదువు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. విద్యార్థుల భోజనాన్ని పరిశీలించి వారికి వడ్డించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారిదేవి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు పదోన్నతి

యాలాల: యాలాల ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేందర్‌రెడ్డి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి చేతుల మీదుగా హెడ్ కానిస్టేబుల్ బ్యాడ్జిని అందుకున్నారు. ఉద్యోగికి పదోన్నతి పొందడం మరింత బాధ్యతను పెంచుతుందని ఎస్పీ అన్నారు. రాజేందర్‌రెడ్డి పదోన్నతి పొందడంపై తోటి ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.



ఎస్పీ చేతుల మీదుగా బ్యాడ్జి అందుకుంటున్న రాజేందర్‌రెడ్డి

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



యూఎస్ఎఫ్ఐలో చేరిన పలు విద్యార్థి సంఘాల నాయకులు

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్

తాండూరు టౌన్ : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యుఎస్ఎఫ్ఐ (భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాగరి వెంకటేశ్ డిమాండ్ చేశారు.మంగళవారం తాండూరు పట్టణంలో పలు విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యావ్యవస్థ మాత్రం గాడిన పడటం లేదన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్ పెంపు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఫర్నిచర్ పంపిణీ

బంట్వారం: బీజేపీ నియోజకవర్గం కోఆర్డినేటర్ వడ్లనందు పుట్టిన రోజు సందర్భంగా కోట్‌పల్లి మండలంలోని ఎన్నారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం వడ్లనందు ఫౌండేషన్ తరఫున విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్ పంపిణీ చేశారు. అలాగే, వాటర్ బాటిళ్లను అందజేశారు. అంతకుముందు నందు పుట్టినరోజు పురస్కరించుకొని కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణాయాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకట్‌చారి, శివకుమార్ పాల్గొన్నారు.



ఫర్నిచర్, బాటిల్స్ పంపిణీ చేస్తున్న సభ్యులు

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కుల్కచర్ల: పోరాటాలతోనే సమస్యలు పరిష్కామవుతాయని, ఆమార్గాన్ని ఎంచుకున్న గొప్పవ్యక్తి గద్దర్‌ని ప్రజా సంఘాలు, ఆయా పార్టీల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ గ్రామంలో గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశ్నించడం ద్వారానే ప్రభుత్వాలు సంక్షేమం గురించి ఆలోచిస్తాయని, అందుకు యువతరం ముందుకునడవాలని పేర్కొన్న గొప్ప సంస్కరణవాది గద్దర్ అని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, బి.వెంకటేష్, బంధయ్య, సలీం , శ్రీనివాస్, రామకృష్ణ, గోపాల్, రమేష్, శ్రవణ్, పాండు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఏఓ రజిత బదిలీ

తాండూరు రూరల్: మండల వ్యవసాయశాఖ అధికారిణి రజిత బదిలీ అయ్యారు. గత 10 సంవత్సరాలుగా తాండూరు మండలంలో పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏఓ రజిత పరిగి మండలానికి బదిలీ అయ్యారు. మండలంలోని సిరిగిరిపేట్ క్లస్టర్ పరిధిలో పని చేస్తున్న ఏఈఓలు శిరిష, ఫర్వీన్ కూడా బదిలీ అయ్యారు. బదిలీవాస్తవమే కానీ, ఆర్డర్స్ రాలేదని ఏడీ రుద్రమూర్తి తెలిపారు.

జోరందుకున్న వరినాట్లు

సన్నవడ్ల సాగు అధికం

పెద్దేముల్: మండలంలోని ఆయా గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. గతంలో కంటే ఈసారి సన్నవడ్ల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. సన్నబియ్యానికి మార్కెట్‌లో మంచి ధర పలకడంతో సాగు పెరుగుతుందని రైతులు అంటున్నారు. మండలంలో 3వేల నుంచి 3400ల ఎకరాల్లో సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. చెరువులు నిండటంతో ఆయకట్టు రైతులు అధికంగా వరిపంటను సాగుచేస్తున్నారు. వడ్లకు మద్దతు ధర లభించడంతో బోరుబావుల రైతులు కూడా వరిసాగు చేస్తున్నారు. వరినాట్లు , పత్తి పంటల్లో కలుపులు ఒకేసారి రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కర్ణాటక రాష్ట్రం షాదీపూర్, కుంచారం ప్రాంతాల నుంచి కూలీలు వచ్చి ఇక్కడ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. సరైన సమయంలో నాట్లు పడుతున్నాయని రైతులు అంటున్నారు.



మన్‌సాన్‌పల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు



తాండూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..



కొడంగల్ రూరల్ : నివాళులర్పిస్తున్న తహసీల్దార్ విజయకుమార్, సిబ్బంది



బొంరాస్‌పేట : నివాళులర్పిస్తున్న టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకులు

ఉద్యమ స్ఫూర్తి ప్రదాతకు నివాళి

ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యమకారులు, ఆయా సంఘాల నేతలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు.



అనంతగిరి: ప్రొఫెసర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ



ధారూరు: నివాళులర్పిస్తున్న తహసీల్దార్



పరిగి: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



అనంతగిరి: నివాళులర్పిస్తున్న బీసీ కమిషన్ సభ్యుడు



తాండూర్‌టౌన్: టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో



నవాబుపేట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద..



కుల్కచర్లలో..